ఆ పాఠశాల మధుర జ్ఞాపకం

- శిథిలావస్థ నుంచి ఆధునికత వైపు
- నేడు కూల్చివేయనున్న భవనం
- ప్రారంభోత్సవానికి సిద్ధంగా నూతన భవనం

కనుమరుగు అవనున్న మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల

దస్తురాబాద్, ఏప్రిల్ 28 : ఆ పాఠశాల చెరుగని జ్ఞాపకం. 52 వసంతాల జ్ఞాపకం కనుమరుగవ్వనున్నది. మారుమూల గ్రామీణ ప్రాంతంలో పాఠశాల విద్య తెలియని రోజుల్లో ఏర్పాటైన పాఠశాల అది. 52 ఏళ్లుగా పేద విద్యార్థులను హక్కున చేర్చుకొని అక్షర జ్ఞానం నేర్పింది పాఠశాల అది. 1972వ సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజ్యసభ సభ్యుడు నారాయణ రెడ్డి ప్రాథమి కొన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఆ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకోవ డంతో మన ఊరు-మన బడి కార్యక్రమంలో ఆ పాఠశాలను ఎంపిక చేసింది. నూతన పాఠశాల భవనం, విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికి డైనింగ్ హాల్, ఇతర మౌలిక వసతుల పనుల కోసం రూ .కోటి 10 లక్షలు మంజూరు చేసింది. ఇప్పుడు నూతన పాఠశాల భవన నిర్మాణం పూర్తి అయింది. ప్రారంభోత్స వానికి సిద్ధంగా ఉంది. కాగా 51 సంవత్సరాలను పూర్తి చేసుకొని 52 సంవత్సరాల్లోకి అడుగు పెట్టిన ఆ పాఠశాల భవనం కనుమరుగవ్వనున్నది. ప్రస్తుతం ఇప్పుడు ఆ పాఠశాల శిథిలావస్థ నుంచి ఆధునిక భవనంలోకి వెళ్తుంది. ఓ వైపు బాధ కలిగించిన విషయం అయిన మరో పక్క నేటి, భవిష్యత్తు తరాల విద్యార్థులకు సంతోషం కల్గించే విషయమే అని చెప్పుకోవచ్చు. కాగా నేడు (సోమవారం) రోజున పాఠశాల భవనాన్ని సదరు కాంట్రాక్టర్ కూల్చివేయనున్నారు అని కాంప్లేక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు టీ గంగాధర్ తెలిపారు.

నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం

సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్నాం

- నేరాల నియంత్రణ, శాంతి భత్రల కోసమే కార్డన్ సెర్చ్
- సీఐ సదారావు

ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సదారావు

ఖానాపూర్, ఏప్రిల్ 28 : సీసీ కెమెరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నామని సీఐ సదారావు అన్నారు. మండలంలోని రాజురా గ్రామంలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఆధ్వర్యంలో 30 మంది పోలీసులు, పలువురు ఎస్ఐలు వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి ఇంటిని, కిరాణ దుకాణాలను నిశితంగా పరిశీలించి సరైన పత్రాలు లేని 81 బైక్‌లు, 6 ఆటోలు, 2 కార్లు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సదారావు మాట్లాడుతూ నేరాల నియంత్రన, సంఘ విద్రోహ శక్తులను గుర్తించేందుకే కార్డన్ సర్చ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కమ్యూనిటి కాంటాక్ట్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, సీసీ కెమెరాల వాడకంపై అవగాహణ కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలనే సదుద్దేశంతో పోలీసులు కార్డన్ సెర్చ్‌ను నిర్వహిస్తున్నారు. యువత మత్తు పదర్థాలకు అలవాటు కాకుండా తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్, పెంబి ఎస్ఐలు ఆర్. శంకర్, లింబాద్రి, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

ఎదులాపురం, ఏప్రిల్ 28 : జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం హైదరాబాద్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. అండర్14, 16,19,3 విభాగం వారిగా వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో క్రీడాకారుల ఎంపికే లక్ష్యంగా మైదానంలో శ్రమించారు. అంతకు ముందు ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ క్రీడాకారుడు అతపుల్లాఖాన్ మాట్లాడుతూ క్రమ శిక్షణ ఉంటే ఏ ఆటలోనైనా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని, పోటీల్లో క్రీడా స్ఫూర్తి తప్పని సరి అని సూచించారు. నిర్వహణ సహాయకులు గౌతం, విజయ్‌కుమార్ ఉన్నారు.

కళలకు నిలయం బాలకేంద్రం

వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కేజీబీవీ సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ

ఎదులాపురం, ఏప్రిల్ 28 : వివిధ భారతీయ కళలకు నిలయంగా బాల కేంద్రం నిలుస్తుందని కేజీబీవీ సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ అన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 5 సంవత్సరాల నుంచి 16ఏళ్లలోపు బాలబాలికలకు శాస్త్రీయ నృత్యం, సంగీత వాయిద్యం, చిత్రలేఖనం, క్రాఫ్ట్, కరాటేకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకేంద్రం పర్యవేక్షకుడు మిట్టురవి, శిక్షకులు దత్తు తదితరులు ఉన్నారు.

గల్ఫ్ అమర వీరుల దినోత్సవం

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 28 : విదేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లిన కార్మికులు, ఉద్యోగులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని ప్రదేశాలు కలిగి ఉండే హక్కుల కోసం పోరాటం చేస్తున్నామని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. పట్టణంలోని పెన్షనర్ల భవనంలో ఆదివారం గల్ఫ్ అమర వీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందుకోసం గల్ఫ్ దేశాలలో బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్ ఇంటర్నేషనల్ బిడబ్ల్యూఐ అనే అంతర్జాతీయ కార్మిక సంఘంతో కలిసి పని చేస్తున్నామన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన, గాయపడిన, వికలాంగులైన, అనారోగ్యానికి గురైన కార్మికుల స్మారకార్థం ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా ఏప్రిల్ 28 న అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం జరుపుకుంటున్నట్లు వివరించారు. తెలంగాణాకు చెందిన ప్రవాసీ కార్మికులు గల్ఫ్ మరియు సింగపూర్ , మలేషియా దేశాలలో సంవత్సరానికి 220కు పైగా చనిపోతున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

నర్సాపూర్, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీసులు తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిర్మల్‌రూరల్ సీఐ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి కేసుల పురోగతిపై తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అక్రమ మద్యం, పరిమితికి మించి డబ్బు రవాణాపై నిఘా పెంచాలన్నారు. ఎన్నికల కోడ్‌ను అతిక్రమించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. 100 డయల్, సైబర్ క్రైమ్, రోడ్డు భద్రత, సీసీ కెమెరాల గురించి తగు సూచనలు అందించారు. వీటిపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో ఎస్ఐ హన్మాండ్లు, సిబ్బంది సాయన్న, గోవింద్, మహేందర్, రమేశ్, సంతోశ్ పాల్గొన్నారు.

విజయ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 28 : పట్టణంలోని విజయ హైస్కూల్‌లో ఆదివారం సాయంత్ర ం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్ర కరన్ రెడ్డి ముఖ్య అథితిగా హాజరయ్యారు. పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రతిభ ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహకులు మంచిర్యాల నాగభూషణం, ప్రమోద్ చంద్రెడ్డి,సుధాకర్, విజయలక్ష్మి, కిషన్,మొహన్ రెడ్డి ఉన్నారు.

కేంద్రం కార్మికవ్యతిరేక విధానాలు విడనాడాలి

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 28 : కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల తీవ్ర అన్యాయం చేసిందని అటువంటి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. ఆదివారం నిర్మల్‌లో మే1న నిర్వహించే మేడే సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోడీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. కార్మిక చట్టాలను బలహీనంగా చేసి సంపన్నులకు కొమ్ము కాసే విధంగా ప్రభుత్వం వ్యవరిస్తుందని ద్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మకుమారీ, రవి, లక్ష్మి, రమేష్, శంకర్, సోమేష్ తదితరులు ఉన్నారు.

తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక

ద్యాయత్ సోమేశ్వర్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్, 28 : నిర్మల్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆదివారం ద్యాయత్ సోమేశ్వర్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా అమ్ముల భూషణ్, కోశాధికారిగా ద్యాయత్ అక్ష య్ ఎన్నికయ్యారు. తైక్వాండో అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని సోసియేషన్ అధ్యక్షుడు ద్యాయత్ సోమేశ్వర్ అన్నారు.

అడెల్లిలో భక్తుల సందడి

సారంగాపూర్, ఏప్రిల్ 28 : మండలంలోని శ్రీ మహా అడెల్లి పోచమ్మ దేవాలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. మహిళలు అమ్మవారికి ఇష్టమైన తీపివంటకాలు వండి నైవేద్యాలు సమర్పించారు. ఆదివారం సెలవు దినం కావడంతో హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల నుండే కాకుండా మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి తమతమ మొక్కులు తీర్చుకున్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ఇచ్చోడ, ఏప్రిల్ 28 : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆదివారం మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(బాలురర)లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ సెంటర్‌లో 346 మంది విద్యార్థులకు 303 మంది విద్యార్థులు హాజరయ్యారు. 43 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని అబ్జర్వర్ వి.గంగాధర్ సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ ఎ.రాజేంద్రప్రసాద్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ అనిల్ కాంబ్లె తెలిపారు.

జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 28 : నిర్మల్ పట్టణంలోని సహప్ర మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్థాయి బాల బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీదర్, చందుల స్వామి తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మే 3 నుంచి 5వ తేదీలలో హైదరాబాద్‌లోని లాలాగూడలో జరుగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరాలకు 9966677105ను సంప్రదించాలన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

కారును తనిఖీ చేస్తున్న ఎఫ్ఎస్టీ బృందం అధికారులు

జైనథ్, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణలో భాగంగా ఆదివారం ఎన్నికల ఎఫ్ఎస్టీ బృందం సభ్యులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్టీ బృందం అధికారి ఎన్.భగవాండ్లు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎవరైన రూ.50 వేలకు పైగా నగదు వెంట తీసుకువెళ్తే సంబంధిత ధ్రువ పత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు. లేని పక్షంలో ఆ నగదును సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల్లో డబ్బులు, ప్రలోభాలకు గురిచేస్తే ఎన్నికల నియామ నిబంధనల మేర కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీడ్కోలు హంగామా

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 28 : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ గాండ్ల శ్రీనివాస్ అన్నారు. అదివారం కృష్ణ వేణి పాఠశాల ఆధ్వరంలో పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థిని, విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డెరెక్టర్ కీర్తీ, ఉపాధ్యాయులు హేమలత, రమేష్, శ్వేత, కళ్యాణి, సాయన్న, చందు, విలియం, మనీషా, వేంకటేష్ తదితరులున్నారు.

1 నుంచి రెండో విడుత ఎన్నికల విధులపై శిక్షణ

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్, 28 : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముథోల్, నిర్మల్, ఖానాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు హౌస్ ఆప్ పీపుల్ ఎలక్షన్ సంబంధించి మే 1 నుంచి రెండో విడత ఎన్నికల విధులపై శిక్షణ ఉంటుందని జిల్లా విద్యాధికారి రవిందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదిన పీవో, ఏపీవోలకు, 2 న పీవో, ఏపీవోలకు, 3న ఓపీవోలకు, 4 న, ఓపీవోలకు, శిక్షణ కార్యక్రమాలు ఉన్నాయన్నారు. అదనపు వివరాలు వ్యక్తిగత ఆర్డర్‌లో పొందుపరిచి ఉంటాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటూ శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు. కలెక్టర్ తీసుకునే చర్యలకు సంబంధిత ఏఆర్‌వో(ఆర్డీవో), ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్, ఎలాంటి బాధ్యత తీసుకోదన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

పెంబి, ఏప్రిల్ 28 : ఆరు గ్యారెంటీల అమలులో నీరు గారుస్తున్న కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని నియోజకవర్గ బీజేపీ నాయకులు రాథోడ్ రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సల్లా రామేశ్వర్ రెడ్డి, ఐదు వెంకటేశ్, దారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏర్పాటు



పాల్గొన్న కార్యనిర్వాహక సభ్యులు

జైనథ్, ఏప్రిల్ 28 : మండలంలోని దీపాయిగూడ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 80 మంది పాల్గొని కార్యనిర్వాహక కార్యవర్గం ఏర్పాటు చేశారు. సభ్యులుగా మార మధుకర్ రెడ్డి, కె.కిషన్, పీఅశ్వత్ రెడ్డి, కే రమేష్, కే సిద్ధార్థ, ఎం కళావతి, వీణారెడ్డి, సుజాతను ఎన్నుకున్నారు. అనంతరం భగవాండ్లు కూతురు శ్రావణి ఎంబీబీఎస్ పూర్తైన సందర్భంగా సన్మానించారు. దీపాయిగూడ గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తామని సభ్యులు తెలిపారు.

ఐస్ యాపిల్స్ వచ్చేశాయ్

- డజన్‌కు రూ. 100 నుంచి రూ.120
- ముంజలో పోషకాలు ఎన్నో..

అమ్మకానికి సిద్ధంగా ఉన్న తాటిముంజలు

భైంసా, ఏప్రిల్, 28 : కేవలం గ్రామీణ ప్రాంతాలో కనిపించే తాటిముంజలు ఇప్పుడు పట్టణాల్లోనూ దర్శనమిస్తున్నాయి. డజన్‌కు రూ. 100 ల నుంచి రూ. 120 వరకు విక్రయిస్తున్నారు. అయినా పోషకాలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. భైంసాలో ముంజలను విక్రయిస్తున్నారు. వీటిలో విటమిన్ బి, ఐరన్, క్యాల్షియం పుష్కలంగా లభిస్తాయి. అలాగే కాలిన గాయాలకు, దద్దుర్లకు మచ్చలకు మంచి ఔషదంగా పనిచేస్తాయి. చిన్నపిల్లలకు వచ్చే ఆటలమ్మ వ్యాధిని నివారించడంలో పని చేస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తాయి. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. తాటిముంజలో ఉన్న పోటాషియం శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపుతుంది. చల్లదనం లభిస్తుంది. దాహార్తిని తగ్గిస్తుంది. వేసవి కాలంలో వీటికి ఎక్కువ డిమాండ్ ఉండడంతో దూర ప్రాంతాల నుంచి భైంసాకు వచ్చిన విక్రయ దారులు ముంజలను విక్రయిస్తున్నారు.

రిమ్స్‌లో రక్తదానం

ఎదులాపురం, ఏప్రిల్ 28 : పట్టణ కిరాణా అండ్ జనరల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిమ్స్ అడిటోరియంలో మెగా రక్తదాన శిబిరాని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజలింగు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాజు, గణేష్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

భైంసా, ఏప్రిల్ 28 : భైంసా పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ రాజారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కోర్వ గల్లికి చెందిన మహ్మద్ బషీర్ శనివారం అదే ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై నారాయణ్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. దీంతో అతని వద్ద 186.310 గ్రాముల పొడి గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. అనంతరం కోర్వగల్లిలోని అతని నివాసంలో తనిఖీలు చేపట్టగా, బషీర్ తల్లి మోసిన్ బేగాం సైతం గంజాయి విక్రయిస్తున్నట్లు ఒప్పుకోగా, ఈ మేరకు ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్న నయాబాదికి చెందిన రిజ్వాన్, అక్బర్ పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని పట్టుకుంటామని వెల్లడించారు.

తండ్రిని చంపిన తనయుడు

నిందితుడి అరెస్టు రిమాండ్‌కు తరలింపు

సోన్, ఏప్రిల్ 28 : సోన్ మండలం మాదాపూర్‌లో తండ్రి ఎల్లయ్యను కొడుకు దేశెట్టి సాయిలు శనివారం రాత్రి పొయ్యి రాయితో ఛాతిపై బలంగా మోదడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాదాపూర్ గ్రామానికి చెందిన దేశెట్టి నడ్పి ఎల్లయ్య (58) మద్యానికి బానిసై ప్రతిరోజు తన భార్య చిన్నక్కతో గొడవపడి ఇష్టరీ తిన కొట్టేవాడు. ఇది గమనించిన ఆమె పెద్ద కుమారుడు దేశెట్టి సాయిలు చాలాసార్లు తన తండ్రికి నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. అయిన ఇదే రీతిన వ్యవహరిచండంతో తన తండ్రిని కడతెరెస్తేనే తల్లి క్షేమంగా ఉంటుందని భావించాడు. తాను అనుకున్న ప్రకారం శనివారం రాత్రి 9 గంటలకు ఎల్లయ్యను పొయ్యి రాయితో ఛాతిపై బలంగా మోదడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం మృతుడి బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోన్ పెట్రోకార్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఎల్లయ్య, చిన్నక్కను నిర్మల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సీ జానకీ షర్మిల, ఎస్డీపీఓ గంగారెడ్డి సూచన మేరకు సీఐ నవీన్‌కుమార్, ఎస్సై రవీందర్, సోన్ సర్కిల్ సిబ్బంది వెంటనే స్పందించి నిందితున్ని పట్టుకొని రిమాండ్‌కు తరలించామని అన్నారు.

బీజేపీని లోక్ సభ ఎన్నికల్లో ఓడించాలి

సమావేశంలో మాట్లాడుతున్న టీఏజీఈఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

ఎదులాపురం, ఏప్రిల్ 28 : ఆదివాహీల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికలో ఓడించాలని టీఏజీఈఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం కార్యాలయంలోని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఏజీఈఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో గిరిజన స్థితిగతులు మరింత దిగజార్చి, గిరిజన ప్రజలు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న చట్టాలను అడవుల ప్రైవేటీకరణ పేరుతో మోసం చేస్తుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న బీజేపీ పాలనకు స్వస్థి చెపాలన్నారు. ఈ సమావేశంలో తుడం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, జిల్లా కార్యదర్శి వెట్టి మనోజ్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావు, జేఏవైఎస్ తోడసం శంకర్, నేతలు కుర్సెంగాతనాజీ, మడవి దిగంబర్, ఉయిక విష్ణు, కొడప సురేష్, ఆత్రం దినేష్, రవి ,తొడసం బీంరావు ,బి.రాహుల్, జగన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

అటవీ సంపదతో ఆదివాసులకు ఉపాధి

ఇప్పపువ్వును సీసీరోడ్డుపై ఆరబెడుతున్న ఆదివాసీ మహిళ

ఇంద్రవెల్లి, ఏప్రిల్28 : అటవీ ప్రాంతంలో వివిధ రకాల చెట్ల ద్వారా లభించే అటవీ సంపదతో ఆదివాసీ గిరిజనులు రోజువారీ ఉపాధి పొందుతున్నారు. మండలంలోని వాల్గోండా, హిరాపూర్, తేజాపూర్, సాలేగూడ, గోపాల్‌పూర్, మారుతిగూడ, లాల్‌టేకడి, ఖైర్‌గూడ, దోడంద, ఘట్టేపల్లి, టేకిడిగూడ, చిలాటిగూడ, తోయగూడ, కొలాంగూడ గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు ప్రతి ఏటా ఇప్పపువ్వుతోపాటు చారోడిలను సేకరించి ఉపాధి పొందుతున్నారు. అటవీ సంపద ద్వారా ఆదివాసీలు ఉపాధి పొందే అనేక ఉత్పత్తుల్లో ప్రధానమైనది ఇప్పపువ్వు . దీనిని ఆదివాసీలు అనువుగా చేసుకొని అటవీ ప్రాంతం నుంచి ఉదయన్నే ఇప్పపువ్వు సేకరించి తీసుకోస్తున్నారు. ఆదివాసీలు సేకరించిన ఇప్పపువ్వును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ఈ ఇప్పపువ్వుతోపాటు చారోడిలు మార్చి నుంచి మే నెల వరకు ఉంటుందని ఆదివాసీలు అన్నారు.

సీసీరోడ్డుపై ఆరబెట్టిన చారోడిలు

సంచార ముస్లింలకు గుర్తింపు ఇవ్వాలి

ఎదులాపురం, ఏప్రిల్ 28 : ఊరూరా తిరుగుతూ జీవనం సాగిస్తున్న సంచార ముస్లింలకు గుర్తింపు ఇచ్చేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్ అన్నారు. ఆదివారం కేఆర్కే కాలనీలో సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంచార ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల పై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులుగా ఎండి అబ్బాస్, షేక్.అక్రమ్, ఉపాధ్యక్షుడిగా షేక్ సయ్యద్‌హుస్సేన్, షాదుల్‌రాజ్ మహ్మద్, కోశాధికారి అంజద్, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్ మాట్లాడుతూ కేవలం రాజకీయ పార్టీలు తమను ఓటు బ్యాంకుగా చూస్తున్నారని ఎన్నికల సమయంలో హామీలను ఇస్తున్నాయన్నారు.

బోనమో పోచమ్మ తల్లి

బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 28 : మండలంలోని పీచర గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకుని ప్రధాన వీధులలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శించిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899

NT-311840-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified